

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

8 పేజీలు | శుక్రవారం | నవంబర్ 17, 2023 | www.navatelangana.com



ప్రేమ్‌సాగర్‌రావు ఎమ్మెల్యే కావాలని గూడెం గుట్టకు పాదయాత్ర

- యాత్రకు పూనుకున్నజీపూర్ మండలం నర్సింగాపూర్‌కు చెందిన గూడా అంజయ్య-శ్యామల దంపతులు

8లో...



నా లావాదేవీలన్నీ లీగల్

- ఏ ప్రభుత్వంతో సంబంధం లేదు
- బాల్క సుమన్ ఆరోపణలు కొట్టిపారేసిన చెన్నూర్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి

4లో...

వివరాలు..2లో...

గులాబీలో నయా జోష్..!



- సీఎం పర్యటనతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం
- అధికారం రాగానే హామీలు నెరవేరుస్తామని భరోసా
- ఆదిలాబాద్, బోథ్ అభ్యర్థులు జోగు రామన్న, అనిల్ జాదవ్‌ను గెలిపించాలని పిలుపు
- జన సంద్రాన్ని తలపించిన ప్రజా ఆశీర్వాద సభలు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్ అర్బన్, ఇచ్చోడ

సోషల్ మీడియా వేదికగా ఎన్నికల ప్రచారాలు



క్షణాల్లో ఫొటోలు అప్‌లోడ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా వాడకం పెరిగిపోయింది. ప్రపంచంలో ఎక్కడ ఏది జరిగినా క్షణాల్లో అర చేతిలోని మొబైల్‌లో వచ్చేస్తోంది. ప్రస్తుతం తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు కొనసాగుతున్న నేపథ్యంలో ఆయా పార్టీలు వాటిని తమ ప్రచార అస్త్రాలుగా మలుచుకుంటున్నాయి. ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో ఆయా పార్టీల అభ్యర్థులు, నాయకులు, స్వతంత్ర అభ్యర్థులు తమ ప్రచారం ముమ్మరం చేస్తున్నాయి. సోషల్ మీడియా వేదికగా ప్రచారాలు చేపడుతూ ఓటేయమని అభ్యర్థిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఇదేతంతు కొనసాగుతోంది. ఒకప్పుడు ఎన్నికల ప్రచారం అంటే డోర్ టూ డోర్ వెళ్లి పథకాలకు, అభివృద్ధి పనులను వివరిస్తూ ఓటేయమని అభ్యర్థించేవారు. కానీ ఇప్పుడు టెక్నాలజీ మారడంతో 5జీ ట్రెండ్‌ను రాజకీయ నాయకులు ఫాలో అవుతున్నారు.

పక్కా ప్లాన్.. సోషల్ మీడియా వాడకం..

ఏదైన సమాచారం సెకన్లలో లక్షలాది మందిని చేరుతుండటంతో ఇప్పుడు పార్టీలన్నీ సామాజిక మాధ్యమాల వైపు చూస్తున్నాయి. ప్రత్యేకంగా వారి ప్రచారానికి సంబంధించి సోషల్ మీడియా డెస్కులు ఏర్పాటు చేసుకొని రోజువారీ ప్రచార వివరాలు, ప్రజలతో మమేకమయ్యే సందర్భాలను సోషల్ మీడియాలో అప్‌డేట్ చేయడానికి అవగాహన ఉన్న వారిని ఉద్యోగాల్లో చేర్చుకుంటున్నారు. అభ్యర్థికి పాజిటివ్ అంశాలను జత చేస్తూ సోషల్ మీడియాలో వీడియోలను షేర్ చేయడానికి వీడియో ఎడిటర్లు, ప్రతిపక్షాల విమర్శలకు కౌంటర్లు, కంటెంట్ రైటర్లను నియమించుకుంటున్నారు. ఫేస్‌బుక్, ఎక్స్(ట్విట్టర్), యూట్యూబ్, ఇన్‌స్టాగ్రాం, వాట్సాప్ చానెల్ ఇలా అనేక సామాజిక మాధ్యమాల వేదికగా ఎన్నికల ప్రచారానికి సిద్ధమయ్యారు. అభ్యర్థులు తమకు మద్దతుగా ప్రచారం చేయాలని అత్యధికంగా ఫాలోవర్స్ ఉన్న పేజీ నిర్వాహకులను సంప్రదిస్తున్నారు. లక్ష సబ్‌స్క్రైబర్స్ ఉన్న యూట్యూబ్ పేజీకి ఓ ధర, ఆపై ఉన్న పేజీలకు ఓ ధరను నిర్ణయిస్తూ వారి మద్దతు

మిగతా..2లో...

గులాబీలో నయా జోష్..!



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్ అర్బన్, ఇచ్చోడ

ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన గులాబీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చింది. ఎన్నికల ముంగిట కేసీఆర్ చేసిన ప్రసంగం ఆ పార్టీ శ్రేణులు, ప్రజలను ఆకట్టుకుంది. ముఖ్యమంత్రి ప్రసంగిస్తున్న సమయంలో జనాలు ఆసక్తిగా విన్నారు. కాంగ్రెస్, బీజేపీలపై విమర్శనస్త్రాలు సంధించిన సమయంలో చప్పట్లు కొడుతూ ఉత్సాహాన్ని ప్రదర్శించారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రలోని డైట్ కళాశాల మైదానం..బోథ్ నియోజకవర్గంలోని ఇచ్చోడ మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలకు సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి ఆటోలు, జీపులు, ఇతర వాహనాల ద్వారా జనాలు తండోపతండాలుగా తరలివచ్చారు. సభా మైదానాలు జన సంద్రాన్ని తలపించాయి. సభ బయట రోడ్ల మీద కూడా నిలబడి కేసీఆర్ ప్రసంగాన్ని వీక్షించారు. మధ్యాహ్నం సమయంలో వచ్చిన కేసీఆర్‌కు అభ్యర్థులతో పాటు ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడారు. ఆదిలాబాద్, బోథ్ బీఆర్ఎస్ అభ్యర్థులు జోగు రామన్న, అనిల్‌జాదవ్‌లను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇక్కడ అభ్యర్థులు గెలిస్తేనే హైదరాబాదులో ప్రభుత్వం ఏర్పడుతుందని తెలిపారు.

అధికారంలో రాగానే హామీలు నెరవేరుస్తాం..!

రాష్ట్రంలో బీఆర్ఎస్ మరోసారి అధికారంలోకి రాగానే ఇది వరకు ఇచ్చిన హామీలన్ని నెరవేరుస్తామని సీఎం కేసీఆర్ భరోసా ఇచ్చారు. ఇది వరకే అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని..రానున్న రోజుల్లో మరిన్ని పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని భరోసా ఇచ్చారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న ఉత్తమమైన వ్యక్తి అని ..పెన్‌గంగా నదిపై చనక-కోర్ట బ్యారేజీ నిర్మించి ఈ ప్రాంత ప్రజల 50ఏండ్ల కల నెరవేర్చారని ప్రశంషించారు. బ్యారేజీకి సంబంధించి ప్రధాన కాల్వల నిర్మాణం పూర్తయిందని..డిస్ట్రిబ్యూటరీ కాల్వల నిర్మాణం జరుగుతోందని త్వరలోనే 50వేల ఎకరాలకు సాగునీరందుతుందని చెప్పారు. అక్కడ్నుంచి పిప్పల్‌కోటి రిజర్వాయర్‌కు లింక్ ఇచ్చి నీళ్ల నింపుతామని పేర్కొన్నారు. ఇప్పటికే జోగు రామన్న తనతో కోట్లాడి ఇంజనీరింగ్ కళాశాల, బీఎస్సీ అగ్రికల్చర్ కళాశాలతో ఐటీ టవర్ తీసుకొచ్చారని గుర్తుచేశారు. మరోసారి జోగు రామన్నను గెలిపిస్తే అన్ని అభివృద్ధి పనులు చేస్తామని భరోసా ఇచ్చారు. అదే విధంగా బోథ్ అభ్యర్థి అనిల్ జాదవ్ మంచి యువకుడని, ప్రజల్లో ఉండే వ్యక్తి అని గుర్తుచేశారు. మరోసారి అధికారంలోకి వచ్చిన పది రోజుల్లో కుప్టి ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తామని, బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటుచేస్తామని హామీనిచ్చారు. బోథ్‌లో డిగ్రీ కళాశాలను కూడా మంజూరుచేస్తామని పేర్కొన్నారు. మరోపక్క పంట నిల్వ కోసం కోల్డ్‌స్టోరేజీలను నిర్మిస్తామని భరోసా ఇచ్చారు. ఇప్పటికే గిరిజనులకు పోడు పట్టాలు జారీ చేశామని, గిరిజనేతరులకు సైతం పోడుపట్టాలు ఇచ్చేందుకు కృషిచేస్తామని చెప్పారు. సిరికొండ మండలంలో చిక్‌మాన్ ప్రాజెక్టును సైతం నిర్మిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో అవార్డు స్వీకరించిన ముక్రా(కె) సర్పంచ్ మీనాక్షిని అభినందించారు. ఆదిలాబాద్‌లో జోగురామన్న, బోథ్‌లో అనిల్‌జాదవ్‌లను గెలిపించాలని అభ్యర్థించారు.

గులాబీ శ్రేణుల్లో జోష్..!

ఆదిలాబాద్, బోథ్‌లో సీఎం కేసీఆర్ హాజరైన ప్రజా ఆశీర్వాద సభలకు భారీ ఎత్తున జనాలు తరలిరావడంతో గులాబీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం కనిపించింది. ఆయా నియోజకవర్గాల్లోని పల్లెలు, తండాలు, గూడేల నుంచి జనం దండిగా కదిలొచ్చారు. ఉదయమే ఆయా ప్రాంతాల నుంచి ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఆదిలాబాద్, ఇచ్చోడకు పయనమయ్యారు. సభా ప్రాంగణానికి కిలోమీటరు దూరంలో వాహనాలు నిలిపి అక్కడ్నుంచి డప్పులు, వాయిద్యాలతో గులాబీ జెండాలు చేతపట్టి నడుచుకుంటూ ర్యాలీగా వచ్చారు. కేసీఆర్ వచ్చేంత వరకు సభా ప్రాంగణంలోనే ఓపిగ్గా ఎదురుచూశారు. సీఎం హెలిక్యాప్టర్ వేదికపై నుంచి చక్కర్లు కొట్టడంతో ఈలలు వేస్తూ ఉత్సాహాన్ని కనబర్చారు. సభలకు భారీగా జనం కదలిరావడంతో బీఆర్ఎస్ అభ్యర్థుల్లోనూ ఆనందం వ్యక్తమవుతోంది.

గెలిపిస్తే మరింత అభివృద్ధి : జోగు రామన్న, బీఆర్ఎస్ అభ్యర్థి, ఆదిలాబాద్



ముఖ్యమంత్రి సహకారంతో ఆదిలాబాద్ నియోజకవర్గాన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఇప్పటికే ఐటీటవర్, అగ్రికల్చర్ కళాశాల, జేఎన్‌టీయూ కళాశాలతో పాటు అనేక పనులు మంజూరయ్యాయని తెలిపారు. ఇక్కడ పత్తి ఎక్కువగా పడుతుందని దీని అనుబంధ పరిశ్రమైన టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రిని కోరారు. ఫార్మసీ కళాశాల మంజూరుచేయాలని, ఇప్పటికే గిరిజనులకు పోడుపట్టాలిచ్చామని..మిగిలిన వారికి కూడా త్వరగా అందజేయాలని తెలిపారు. మీకు విశ్వాసం, నమ్మకం ఉందని మరోసారి అధికారంలోకి రాగానే ఆయా వినతులను పరిష్కరించాలని కోరారు. తనను గెలిపిస్తే ఆదిలాబాద్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అధికారంలోకి రాగానే హామీలు అమలు : అనిల్‌జాదవ్, బీఆర్ఎస్ అభ్యర్థి, బోథ్



రాష్ట్రంలో బీఆర్ఎస్ మరోసారి అధికారంలోకి రాగానే బోథ్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బోథ్ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్‌జాదవ్ ముఖ్యమంత్రికి విన్నవించారు. కుప్టి ప్రాజెక్టు నిర్మాణం, బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటుచేయడంతో పాటు డిగ్రీ కళాశాల మంజూరుచేయాలని కోరారు. గిరిజనేతరులకు సైత పోడు పట్టాలిప్పించాలని విజ్ఞప్తి చేశారు. తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

సోషల్ మీడియా వేదికగా ఎన్నికల ప్రచారాలు

(మొదటి పేజీ తరువాయి)

కూడగట్టుకుంటున్నారు. ఇప్పటికే వార్త కంటెంట్‌తో ఉన్న యూట్యూబ్ పేజీలకు మరింత డిమాండ్ పెరిగింది. అభ్యర్థి ప్రచారం నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు కంటెంట్ సృష్టించి వీడియోలు ప్రసారం చేసి అభ్యర్థికి ఆదరణ వచ్చేలా యాక్టివిటీ అంతా సోషల్ మీడియా నిర్వాహకులే చూసుకుంటారు.

క్షణాల్లో అప్‌లోడ్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రధాన పార్టీల నుండి కొందరు అభ్యర్థులకు సోషల్ మీడియా అంత అవగాహన లేనప్పటికీ అవగాహన ఉన్నవారితో ప్రచారం చేయించుకుంటున్నారు. చెన్నూర్ బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్, నిర్మల్ బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్ రెడ్డి, నిర్మల్ బీఆర్ఎస్ అభ్యర్థి ఇంద్రకరణ్‌రెడ్డి అలాగే ఆయన కోడలు దివ్యారెడ్డి, ఆదిలాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి జోగు రామన్న, కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డి ఇలా ఒకరు అని కాదు.. అందరూ దాదాపు సోషల్ మీడియాపైనే ఫోకస్ పెట్టారు. ప్రతి నిత్యం ప్రచారానికి ఏదైన గ్రామం, కాలనీకి వెళ్తే ఆ ప్రచార ఫొటోస్ క్షణాల్లో సోషల్ మీడియాలో అప్‌లోడ్ అవుతున్నాయి. ప్రధాన పార్టీల మేనిఫెస్టోను పోస్టర్ రూపంలో తయారు చేసి వాట్సాప్ గ్రూపుల్లో, ఇన్‌స్ట్రాగ్రాంలో అప్‌లోడ్ చేస్తూ ప్రచారాలు చేపడుతున్నారు.. మొత్తానికి రాజకీయ నాయకులంతా సోషల్ మీడియాపై దండయాత్ర చేస్తున్నారు.

రీల్స్ చేస్తూ తమదైన శైలిలో ప్రచారం

ఈ మధ్య ఇంకో కొత్త ట్రెండ్‌ను నాయకులు ఫాలో అవుతున్నారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు సోషల్ మీడియాను తమదైన శైలిలో వాడేస్తున్నారు. ఇందులో భాగంగా తాజాగా ప్రచార గీతాలతో పాటు రీల్స్ చేస్తూ మయమర్పిస్తున్నారు. ఇటీవల మేం ఫెమాస్ అనే సినిమాలో బ్యాండ్ కొడుతూ రీల్స్ చేశారు. ఆ సినిమాలోని ఆ పార్ట్‌ను కాపీ కొడుతూ సినిమా మాదిరిలాగా యాక్టింగ్ చేస్తున్నారు. అన్నొస్తే అపొజిషన్ రన్..రన్, నిర్మల్‌లో గెలవటానికి మన అన్న ఇంద్రకరణ్, అప్పుడు ఎట్లుండే తెలంగాణ.. ఇప్పుడు ఎట్లయింది తెలంగాణ అంటూ ఈలలు కేకలు వేస్తూ తీన్మార్ స్టెప్పులేస్తున్నారు. మొత్తానికి తమ గెలుపుకోసం పార్టీల అభ్యర్థులు సోషల్ మీడియాను విపరీతంగా వాడుతూ ఓటర్లను, యువతను ఆకర్షిస్తున్నారు. గెలుపోటముల విషయం పక్కన బెట్టితే సోషల్‌మీడియాలో వీరి హల్‌చల్ గురించే ప్రధానంగా చర్చ జరుగుతోంది.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి



నవతెలంగాణ-భీమారం

నిర్భయంగా ప్రజలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జైపూర్ ఏసీపీ బి.మోహన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో శ్రీరాంపూర్ సీఐ జి.రమేష్ బాబు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఆవుడం క్రాస్ రోడ్డు నుంచి బస్టాండ్ మీదుగా జెడ్పీ హైస్కూల్, రెడ్డికాలనీ, సుమ హాస్పటల్ ప్రధాన కూడళ్ల గుండా కవాతు నిర్వహించారు. 30న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం పంపిణీపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా గట్టి బందోబస్తు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై రాజవర్ధన్, జైపూర్, శ్రీరాంపూర్, చెన్నూర్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా స్విమ్మింగ్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్‌టౌన్ : జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 18న జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో 14, 17 సంవత్సరాల విభాగం బాల బాలికల ఉమ్మడి జిల్లా జోనల్ స్థాయి స్విమ్మింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ సిహెచ్ కాంతారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే ఉమ్మడి జిల్లా క్రీడాకారులు బోనాఫైడ్, బర్త్ సర్టిఫికెట్, గత సంవత్సరం ప్రోగ్రెస్ కార్డ్‌తో పాటుగా 4 సెట్ల ఎలిజిబిలిటీ ఫారాలతో ఉదయం 10గంటలకు స్టేడియంలో పోటీల ఆర్గనైజర్, స్విమ్మింగ్ కోచ్ కృష్ణకు రిపోర్టు చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9494945402 నెంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.



రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు సీఓఈ విద్యార్థులు

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి(సిఓఈ) విద్యార్థులు ఐనాల భగవత్(7వ తరగతి), చందా అక్షిత్(9వ తరగతి) స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జిఎఫ్) అండర్ -14 జోనల్ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఐనాల సైదులు తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను గురువారం కళాశాలలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, వ్యాయామ ఉపాధ్యాయులు అల్లూరి వామన్, నడిగోటి రాజేష్, ఎస్‌జిఎఫ్ జిల్లా కార్యదర్శి పరిమళ పాల్గొన్నారు.

పునరావాస గృహాలను సందర్శించిన పీసీసీఎఫ్

నవతెలంగాణ-కడెం

మండలంలోని కొత్తమద్ది పడగ గ్రామ శివారులో నూతనంగా రాంపూర్, మైసంపేట్ గ్రామాల పునరావాసుల కొరకు నిర్మించిన గృహాలను, వ్యవసాయ క్షేత్రాలను పీసీసీఎఫ్ మోహన్ చంద్ర పర్గైన్ టైగర్ రిజర్వు ఫారెస్ట్ ఎఫ్‌డీపీటీ శాంతారామ్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పునరావాస గృహాలను, వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం మైసంపేట్, రాంపూర్ గ్రామాల ప్రజలతో సమావేశం నిర్వహించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. అలాగే పలు సమస్యల పట్ల విజ్ఞప్తి చేయడంతో వాటి పట్ల చర్చించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి రామ్‌కిషన్, ఫారెస్ట్ డివిజనల్ అధికారి భవాని శంకర్, కడెం మండల అటవీ అధికారి అనిత, డీఆర్‌ఓలు ప్రకాష్ సిద్ధార్థ్, అటవీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేస్తా..

● ఖానాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్



ప్రచారంలో భాగంగా మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-కడెం

అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేస్తానని ఖానాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండలంలోని ఉడుంపూర్, దోస్తనగర్, లక్ష్మీపూర్ నవాబ్‌పేట్, అంబారిపేట్, పాండ్వాపూర్, కొండుకూర్, కన్నాపూర్, వకీల్‌నగర్ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బొజ్జు పటేల్ మాట్లాడుతూ తెలంగాణలో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని అన్నారు. అధికార పార్టీ నిర్లక్ష్యం వల్లనే కడెం ప్రాజెక్టు మరమ్మతులు నోచుకోలేదని, ప్రతి సంవత్సరం కడెం ప్రాజెక్టు డేంజర్ జోన్‌లో ఉన్న కడెం ప్రాజెక్టుపైన గానీ కడెం రైతాంగంపైన గాని కొంచెం కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం చిత్తశుద్ధి లేదన్నారు. కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 6గ్యారంటీలను కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తెలంగాణ రాష్ట్రంలో పక్కగా అమలు చేస్తామని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు నిరుపేదలు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవాలని అన్నారు. హస్తం గుర్తుకు ఓటు వేసి వెడ్మ బొజ్జు పటేల్‌ను గెలిపించాలని అన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని సమస్యల సాధనకు కృషి చేస్తానని తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి కావాలంటే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవాలని అన్నారు. ప్రజలందరూ తమ విలువైన ఓటును హస్తం గుర్తుకు ఓటు వేసి బొజ్జు పటేల్‌ను గెలుపొందించాలని ప్రజలను కోరారు. అనంతరం అంబారిపేట్ ఎంపీటీసీ కట్ట సింధుజ సాగర్, మాజీ ఎంపీటీసీ ముత్తినేని తిరుపతి, గ్రామంలోని పలువురు నాయకులు బొజ్జు పటేల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కడెం మండల ఎంపీపీ ఆంటోనీ అలెగ్జాండర్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, మాజీ జెడ్పీటీసీ తక్కల సత్య నారాయణ, అంబారిపేట్ మాజీ సర్పంచ్ మెరుగు రవీందర్‌రెడ్డి పొద్దుటూరి సతీష్‌రెడ్డి, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షులు వెంకటేష్, అంబారిపేట్ గ్రామ అధ్యక్షులు కుమ్మరి రమేష్, శీను, వాజీద్‌ఖాన్, మహేష్, శ్రీధర్, రమేష్, సతీష్ ఇస్రు, బబ్లు, ఎల్లగడప మాజీ సర్పంచ్ మౌనిక భూమేష్, రాజేష్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

● బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని, బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జీ అల్లోల సురేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రానికి చెందిన గంగపుత్ర యువజన సంఘం సభ్యులు 40 మంది బీఆర్ఎస్‌లో చేరారు. అల్లోల సురేందర్‌రెడ్డి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి గెలుపు కొరకు కృషి చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. మునుపెన్నడు లేని విధంగా మండలాన్ని అభివృద్ధి చేసిన ఘనత మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మెన్ రఘునందన్ రెడ్డి, మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, బిట్లింగ్ నారాయణ, రజనీకాంత్, జహీర్, భూమన్న, దశరథ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

ఈ నెల 30న నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతీ ఒక్కరూ సహకరించాలని ఎస్సై శ్రీకాంత్ కోరారు. గురువారం మండలంలోని రాచపూర్ గ్రామ పరిధిలోని పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఎలాంటి ఫిర్యాదు చేయాలని అనుకున్న సీవిజిల్ అప్లికేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. సీవిజిల్ అప్లికేషన్ గురించి ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ప్రలోభాలకు గురి కాకుండా, తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ టీం అధికారి నాగప్రతాప్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా బీఆర్ఎస్ ప్రచారం

నవతెలంగాణ-కుభీర్

బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. గురువారం మండలంలోని న్యూసాంవ్లీ, వాయి, లింగి, గ్రామాల్లో మండల నాయకులు జోరుగా ప్రచారం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్, మండలాధ్యక్షుడు ఎన్నిల అనిల్ మాట్లాడుతూ గత 10 సంవత్సరాల్లో తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం చేపట్టిన వివిధ రకాల అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు. అదే విధంగా మళ్లీ మూడోసారి బీఆర్ ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావలన్నారు. వచ్చిన వెంటనే రైతులకు రైతుబంధు రూ.16వేలు అందించి, వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా మరిన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. దీంతో మండలాన్ని మరింతగా అభివృద్ధి పరిచేందుకు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీల అభ్యర్థుల మాటలు నమ్మి మోసపోకుండా ఉండాలని సూచించారు. గ్రామంలో ఉన్న ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శంకర్ చవాన్ పీఏసీఎస్ చైర్మెన్ గంగాచరణ్ కోఆప్షన్ సభ్యుడు దత్తుహరి పటేల్, సర్పంచులు మహిపాల్‌రెడ్డి, కేరళ గంగాధర్ మల్లారెడ్డి, బీఆర్ఎస్ కార్యకర్తలు, మండల నాయకులు పాల్గొన్నారు.



ఇంటింటికి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కేంద్రానికి చెందిన యాదవ సంఘం సభ్యులు గురువారం బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతూ బీఆర్ఎస్‌లో చేరారు. వారికి యాదవ సంఘం నాయకులు మేకల రాజేందర్ యాదవ్ బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ప్రతి కార్యకర్త బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా మండలాన్ని అభివృద్ధి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ మంచాల శ్రీకాంత్ యాదవ్, యాదవ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్ యాదవ్, గ్రామాధ్యక్షులు రమేష్ యాదవ్, మల్లేష్ యాదవ్, రాజు యాదవ్, రాజేశ్వర్ యాదవ్, బర్కం రాజు యాదవ్, రాజమల్లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆదరించండి మరింత అభివృద్ధి చేసి చూపిస్తా

● బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నవతెలంగాణ-నిర్మల్

తాను చేసిన అభివృద్ధిని చూసి ఆదరించాలని, తమకు ఓటు వేసి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని మంత్రి బీఆర్ఎస్ నిర్మల్ నియోజకవర్గం అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. గురువారం నిర్మల్ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో, అలాగే పట్టణంలోని పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు అందుతున్నాయని అన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఎన్నికలు వచ్చినప్పుడే ప్రజలు గుర్తుకు వస్తారని, వారి మాయమాటలకు నమ్మవద్దని సూచించారు. తమకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారంలో భాగంగా మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

బీఆర్‌ఎస్‌లో చేరిన కొండ గంగాధర్

- కండువా కప్పి ఆహ్వానించిన సీఎం కేసీఆర్



నవతెలంగాణ- ఆదిలాబాద్ అర్బన్

కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ పదవికి ఇటీవల రాజీనామా చేసిన కొండ గంగాధర్ బీఆర్‌ఎస్‌లో చేరారు. గురువారం ఆదిలాబాద్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జోగురామన్న సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. 1999లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆయన భార్య కొండ లక్ష్మీ ఆదిలాబాద్ మండల జడ్పీటీసీగా వ్యవహరించారు. ఇన్నాండ్లు కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుడిగా కొనసాగారు. ఇటీవల ఆ పార్టీలో జరిగిన పరిణామాలకు అసంతృప్తికి గురైన ఆయన తాజాగా గులాబీ పార్టీలో చేరారు. సీఎం కేసీఆర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

తెలంగాణ బొగ్గు గని కార్మికుల ర్యాలీ



నవతెలంగాణ-రెబ్బెన

తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం మండలంలోని గోలేటి బస్టాండు నుండి జీఎం ఆఫీస్ కార్యాలయం వరకు బీఆర్‌ఎస్ అభ్యర్థి కోవలక్ష్మి కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ర్యాలీ నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని, మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఓటు వేసి బీఆర్‌ఎస్‌ను అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేయస్ వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు, గోలేటి సర్పంచ్ పోటు సుమలత శ్రీధర్‌రెడ్డి, గోలేటి టౌన్ ప్రెసిడెంట్ మోర్లె నరేందర్, సంఘం ప్రకాష్‌రావు, సాంబగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలి

నవతెలంగాణ-కుభీర్

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని జిల్లా మార్కెటింగ్ అశ్వక్ హైమద్ అన్నారు. గురువారం కుభీర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తికొనుగోళ్లను ప్రారంభించారు. ముందుగా కాంటాలకు ప్రత్యేక పూజలు చేసి, అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ద్వారా క్వింటల్‌కు రూ.7020 మద్దతు ధర ప్రకటించిందని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మార్కెట్ యార్డులో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. అదే విధంగా రైతులు తమ పంటలను మార్కెట్‌కు తీసుకువచ్చేటప్పుడు ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ పత్రాలను తీసుకువచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఓ వెంకటేశ్వర్, కార్యదర్శి గంగన్న, వ్యాపార వేత్తలు సంతోష్, రఫిక్, గజనంద్, అప్సర్, ఆనంద్, రైతులు ఉన్నారు.



నా లావాదేవీలన్నీ లీగల్

- ఏ ప్రభుత్వంతో సంబంధం లేదు
- బాల్క సుమన్ ఆరోపణలు కొట్టి పారేసిన మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ప్రభుత్వానికి పన్ను కట్టి వ్యాపారం చేసే వ్యక్తిని తానని, బాల్క సుమన్‌లాగా ఇసుక పన్ను ఎగ్గొట్టి సొమ్ము చేసుకోలేదని చెన్నూర్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. గురువారం మంచిర్యాలలోని హైటెక్ సిటీలో తన నివాసంలో వివేక్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన సంస్థలు అన్ని ప్రయివేట్ సంస్థలని, తన లావాదేవీలతో ప్రజలకు నష్టం ఏమీ ఉండదని తెలిపారు. కేసీఆర్ కాళేశ్వరం, మిషన్ భగీరథ స్కీంలతో కోట్ల రూపాయల ప్రజాధనం గొల్లగొట్టాడన్నారు. గ్రావిటీని పరిగణనలోకి తీసుకోకుండా కాళ్ల దగ్గర కాళేశ్వరం కట్టిన తుగ్లక్ మన ముఖ్యమంత్రి అని మండిపడ్డారు. సింగరేణిలో బీఆర్‌ఎస్ వచ్చిన తర్వాత 20వేల ఉద్యోగాలు కోల్పోయామన్నారు. గెలిచిన తర్వాత చెన్నూరు నియోజకవర్గంలో అనుబంధం పరిశ్రమలు ఏర్పాటు చేసి 30 నుండి 40 వేల ఉద్యోగాలు ఇప్పిస్తానని పేర్కొన్నారు. ప్రచారంలో చాలా మంది చాలా



సమస్యలు తన దృష్టికి తెచ్చారని తెలిపారు. 50 బెడ్స్ ఆస్పత్రి, చెన్నూరు టౌన్‌లో సెంట్రల్ లైటింగ్ చూపెట్టి బాల్క సుమన్ అభివృద్ధి అంటున్నాడని ఎద్దేవా చేశారు. మంచిర్యాల నుంచి బెల్లంపల్లి వరకు మంచి నీటి పైప్‌లైన్ తన తండ్రి వెంకటస్వామి హయాంలో నిర్మాణం జరిగిందన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు ఆర్‌కెపి బ్రిడ్జి కోసం నిధులు మంజూరు చేయించానని, కానీ క్యాతన్‌పల్లి రైల్వే బ్రిడ్జి ఇప్పటికీ పూర్తి కాలేదని, ఫలితంగా ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. యువత కోసం మందమర్రి, ఆర్‌కెపి, చెన్నూర్‌లో స్కిల్ డెవలెప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తామని, అగ్రికల్చర్ రీసెర్చ్ సెంటర్‌ను చెన్నూర్‌లో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గడ్డం వంశీ, ఐఎన్టియుసి వర్కింగ్ ప్రెసిడెంట్ జనక్ ప్రసాద్, పిసిసి ప్రధాన కార్యదర్శి పిన్నంటి రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

ముమ్మరంగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ప్రచారం



నవతెలంగాణ-జైపూర్

మండల పరిధిలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల ఎన్నికల ప్రచారం ముమ్మరంగా కొనసాగుతుంది. గురువారం కానుకూరు, మిట్టపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. మండల అధ్యక్షులు బలమూరి అరవింద్‌రావు, ఎంపీపీ గోదారి రమాదేవి లక్ష్మన్, జెడ్పీటీసీ మేడి సునిత తిరుపతిల ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు కారు గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలో అభివృద్ధి కొనసాగాలంటే చెన్నూర్ నియోజకవర్గంలో బాల్క సుమన్, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు కావాలన్నారు. అభివృద్ధిని కాంక్షించే వారంతా కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఓటర్లను అభ్యర్థించారు. ఇంటింటి ప్రచారం చేశారు.

కాంగ్రెస్‌తోనే బడుగుబలహీణ వర్గాల అభివృద్ధి

తెలంగాణ రాష్ట్రంలో బడుగు బలహీణవర్గాలు అభివృద్ధి చెందాలంటే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని ఆ పార్టీ నాయకులు అన్నారు. గురువారం కానుకూరు గ్రామంలో పార్టీ తరపున ప్రచారం చేసిన నాయకులు హస్తం గుర్తుకు ఓటేయ్యాలని కోరారు. మండల అధ్యక్షులు ఫయాజోద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్ రెడ్డి, గంగిపల్లి సర్పంచ్ పాలమాకుల లింగారెడ్డి, మాజీ జెడ్పీటీసీ, సర్పంచులు చల్ల సత్యనారాయణ రెడ్డి, తుమ్మనపెల్లి రామారావు, సంతోషం శేఖర్, ఉస్కమల్ల రవి, గుడెల్లి శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, పాగాల శంకర్‌తో పాటు పలువురు యువకులు పార్టీలో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చెన్నూర్ నియోజకవర్గంలో అభ్యర్థి గడ్డం వివేక్ వెంకటస్వామి గెలుపుకు తమవంతుగా కృషి చేస్తామని పేర్కొన్నారు.

విద్య, వైద్య, సాగునీటి వనరులతో అభివృద్ధి చెందాలి

నవతెలంగాణ-ఉట్నూర్

రాష్ట్రంలో విద్య, వైద్యం, సాగు నీటి వనరులతో అభివృద్ధి చెందినప్పుడే ప్రజలు అభివృద్ధి చెందుతారని ఖానాపూర్ నియోజవర్గం స్వతంత్ర అభ్యర్థి రాథోడ్ మోహన్ అన్నారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖానాపూర్ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న అభ్యర్థులు గ్రామీణ ప్రాంతాల ప్రజల కోసం ఏమి చేస్తారో, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ఎలా అందిస్తారో ప్రజలకు తెలుపాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వం అందిస్తున్న రక్షిత నీటి వనరుల కార్యక్రమాలు సక్రమంగా పనిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. విద్యారంగాన్ని అభివృద్ధి చేసి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలు నెలకొల్పడం ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. చెరువులు నిర్మించి కాలువలు నిర్మించకపోవడంతో సాగునీటి వనరులు అందక రైతులకు ప్రయోజనం కలగడం లేదన్నారు. గ్రామీణ ప్రాంతాలలో రైతు సహకార సంఘాలు అభివృద్ధి చేసి వారికి అందుబాటులో ట్రాక్టర్లను ఉంచాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో మద్యం ఏరులై పారకుండా ఉండటానికి బెల్ట్ షాపులను రద్దు చేసి, గ్రామాల్లో బెల్ట్ షాపులు ఉండటం వల్ల చిన్నారులు సైతం మద్యం తాగుతూ మత్తుకు బానిసలవుతున్నారన్నారు. రాష్ట్రంలో ఆదిలాబాద్ జిల్లా ఎంతో వెనుకబడిపోయిందని



ప్రభుత్వాలు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందని అన్నారు. నియోజకవర్గ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీలో ఉన్నానని, ప్రజలు ఆశీర్వాదించి ఎమ్మెల్యేగా చేస్తే నియోజకవర్గ పరిధిలోని అన్ని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రాథోడ్ నూర్‌సింగ్, జాదవ్ పాండురంగ్, రాథోడ్ అరుణ్, శ్రీకాంత్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని మునిపెల్లి గ్రామానికి చెందిన దూదేకుల షేక్ మహ్మద్ (64) బుధవారం నిర్మల్‌లో జరిగిన రేవంత్ సభకు వెళ్లి గుండెపోటుతో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు అల్లోల సురేందర్‌రెడ్డి, కొరిపెల్లి కృష్ణారెడ్డి గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అట్ల రాంరెడ్డి, ఈటెల శ్రీనివాస్, అట్ల చిన్న రాంరెడ్డిలు బాధిత కుటుంబాన్ని ఓదార్చి రూ.50 వేలు అందజేశారు. కొందరు గ్రామస్తులు కలిసి జమ జేసి రూ.3501 అందజేశారు. మొత్తం రూ.73వేల 501 ఆర్థిక సాయం అందినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

బీఆర్‌ఎస్ ఇంటింటికి ప్రచారం

నవతెలంగాణ-నార్నూర్

బీఆర్‌ఎస్ పార్టీ ప్రచారంలో భాగంగా గురువారం పార్టీ నాయకులు కార్యకర్తలు పార్టీ తరుపున ఊరూరా ప్రచారం చేశారు. మండల కేంద్రంతో పాటు చోర్‌గావ్, సుంగాపూర్, గ్రామాల్లో పార్టీ ఇచ్చిన మేనిఫెస్టో హామీలను వివరిస్తూ ప్రచారం చేశారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మిని గెలిపిస్తే నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని వివరించారు.

కాంగ్రెస్‌కే మా మద్దతు : వైఎస్సార్‌టీపీ



నవతెలంగాణ-ముధోల్

ముధోల్ అసెంబ్లీ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి భోస్లే నారాయణరావు పటేల్‌కు తమ మద్దతు ఉంటుందని వైఎస్సార్ టీపీ ముధోల్ నియోజకవర్గ ఇన్‌చార్జీ బెజ్జంకి ముత్యంరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు షర్మిల నిర్ణయం మేరకు కట్టుబడి ఉండి తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్‌కే సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడం ఖాయమని అన్నారు. ముధోల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భోస్లే నారాయణరావు పటేల్ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు చెప్పారు. నియోజవర్గంలో గడప గడపకు వెళ్లి ఇంటింటా ప్రచారం నిర్వహించి, ముధోల్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బి నారాయణరావు పటేల్ గెలిపించుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ టీపీ భైంసా టౌన్ వైస్ ప్రెసిడెంట్ ఇమ్రాన్ ఖాన్, ముధోల్ మండలం అధ్యక్షులు ఎస్‌కే నజీమ్, లోకేశ్వరం యూత్ ప్రెసిడెంట్ రాజేందర్, బి.సాయన్న, మల్లయ్య ప్రకాష్, షేక్ జాబీర్ పాల్గొన్నారు.

కందికి మద్దతు ప్రకటించిన ముస్లిం లీగ్ ప్రతినిధులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ గాలి వీస్తోందని, జనం కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డి వెంటే ఉన్నారని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఫయాజ్ హష్మి అన్నారు. గురువారం ఆదిలాబాద్‌లోని ప్రజాసేవాభవన్‌కు ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ప్రతినిధులు వచ్చి కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. వీరికి కంది శ్రీనివాసరెడ్డి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హష్మి మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న అవినీతిని ప్రజలకు వివరించి చైతన్య పరచాలన్నారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్సేనని అన్నారు. షాదీ ముబారక్ పథకం కేవలం బీఆర్ఎస్ ఏజంట్ల జేబులు నింపేందుకే పనికొస్తోందన్నారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేస్తున్న కొన్ని దుష్ట శక్తులతో ముస్లింలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. కంది శ్రీనివాసరెడ్డి ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చారంటూ కొందరు అనవసర దుష్ప్రచారం చేస్తున్నారని, దీన్ని ముస్లింలు అస్సలు నమ్మొద్దని తెలిపారు. కార్యక్రమంలో ఏఐసీసీ సెక్రటరీ, తెలంగాణ ఇన్‌చార్జి విష్ణునాథ్, ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రకాష్ రాథోడ్, టీపీసీసీ కార్యదర్శి సత్తు మల్లేష్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



నవతెలంగాణ-తలమడుగు

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని ఖోడద్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సులిగెల గంగన్న ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఉదయం సులిగెల గంగన్న వ్యవసాయ పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరు లేని సమయంలో షార్ట్ సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లోని నిత్యావసర సరుకులు, బట్టలు పూర్తిగా కాలిపోయాయని తెలిపారు. స్థానికులు మంటలను ఆర్పారు. సుమారు రూ.లక్ష ఆస్తిం నష్టం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు కోరారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం

● ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ ఇన్‌చార్జి విష్ణునాథ్



కాంగ్రెస్ మేనిఫెస్టో చూపిస్తున్న సీనియర్ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డి మంచి సమాజ సేవకుడని, సామాజిక స్పృహ కలిగిన ఉన్నత విద్యావంతుడని ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ ఇన్‌చార్జి విష్ణునాథ్ అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని ప్రజాసేవా భవన్‌కు విచ్చేసిన ఆయనకు ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ ప్రకాష్ రాథోడ్, టీపీసీసీ కార్యదర్శి సత్తు మల్లేష్‌తో కలిసి కంది శ్రీనివాసరెడ్డి పూలబొకే అందించి సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విష్ణునాథ్ మాట్లాడారు.ప్రజల ఆకాంక్షలను గుర్తించి, ఆనాడు కాంగ్రెస్ పార్టీ, సోనియమ్మ తెలంగాణ ఇచ్చిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేసే ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని పేర్కొన్నారు. పక్కాగా ఆదిలాబాద్ స్థానాన్ని హస్తం పార్టీ గెలవబోతోందని, అందులో ఎలాంటి సందేహం అక్కర్లేదని అన్నారు. ఏఐసీసీ నిర్వహించిన సర్వేలోనూ అదే స్పష్టమైందన్నారు. ఆరు గ్యారంటీ కార్డులను ఇంటింటికీ ప్రచారం చేసే కార్యకర్తల కృషి ని కాంగ్రెస్ అధిష్టానం గుర్తిస్తోందని అన్నారు. ఖచ్చితంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రానుందని, డిసెంబర్‌లో మన ముఖ్యమంత్రి అధికారం చేపట్టనున్నారని తెలిపారు. సోనియమ్మ జన్మదినమైన వచ్చే డిసెంబర్ 9 నుండి 6 గ్యారంటీలు అమలు కానున్నాయన్నారు. ఖుర్షీద్‌నగర్, రిక్షాకాలనీ, ఇందిరమ్మ కాలనీ, చిల్కూరికాలనీ, పిట్టలవాడ, దుర్గానగర్, సుందరయ్యనగర్ ఇవన్నీ కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన ఇంటి స్థలాలేనన్నారు. అనంతరం ప్రజాసేవా భవన్‌కు చేరుకున్న కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి ఆకాష్ జాదవ్‌కు కంది శ్రీనివాసరెడ్డితో పాటు జిల్లా నాయకులు ఘనస్వాగతం పలికారు. తెలంగాణలో కచ్చితంగా రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆకాష్ జాదవ్ అన్నారు. ఈ సందర్భంగా జైనథ్ మండలం కూర గ్రామ సర్పంచ్ అడ్డి లత వెంకట్‌రెడ్డి దంపతులు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆకాష్ జాదవ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానం పలికారు. అలాగే దూదేకుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్‌తో పాటు సంఘానికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరగా అందరికీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ఐకేరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకుందాం

నవతెలంగాణ-నిర్మల్

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. గురువారం నిర్మల్ పట్టణంలోని వార్డు నెంబర్ 33 భాగ్యనగర్, రాధాకృష్ణ మందిర్ ప్రాంతంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా కాలనీవాసులు, సంఘ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. మహిళలతో పలు అభివృద్ధి, పనులపై చర్చించారు. నిర్మల్ అభివృద్ధి ప్రదాత, నిర్మల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. వార్డులో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు గూర్చి వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఇంద్రన్నకే అందరి మద్దతు తెలిపి, కారు గుర్తుకే ఓటు వేసి, హ్యాట్రిక్ విజయం సాధించేందుకు కృషి చేస్తామని కాలనీవాసులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ మేనిఫెస్టోను వివరిస్తున్న మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, నాయకులు

ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-కడెం

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖానాపూర్ నియోజకవర్గంలోని జన్నారం మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జొన్నల చంద్రశేఖర్ గుప్తా, నిర్మల్ జిల్లా జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ రఫీక్ అహ్మద్ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నారని అన్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వేలాదిగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కడెం మండల వైస్ ఎంపీపీ శ్యాంసుందర్, సర్పంచులు కొండాపురం అనూష లక్ష్మణ్, విజయ స్టీఫెన్, ఎంపీటీసీల ఫోరం కడెం అధ్యక్షులు మల్లేష్, బెల్లాల్ ఎంపీటీసీ సుద్దాల లక్ష్మీ జగన్, ఖానాపూర్ ఆత్మ కమిటీ డైరెక్టర్ మహిళా మండల అధ్యక్షులు బోయిని మంగ, మాజీ ఎంపీపీ భుక్యా అమ్మి బాబురావు, ఉపసర్పంచ్ ఎండీ అజాం, ఉపసర్పంచ్ రామాగౌడ్, సీనియర్ నాయకులు ఎండీ కలీం, చోటు, ఎండీ హసీబ్, నల్లగొండ, కొప్పుల నరేష్, కోల గంగన్న, బోర్లకుంట రాజేష్, కళ్లెం తిరుపతిరెడ్డి, చెన్ను మల్లేష్, వెన్నెల సత్తన్న, శనిగారపు రాజేశ్వర్, ముత్యనేని శివయ్య, గంగాధర్, నర్సయ్య, సత్యం, భుక్యా శేఖర్, నాగవత్ రమేష్ నాయక్, నాగవత్ గంగాధర్, వేణు నాయక్, జాడి నర్సయ్య, ఆళ్ల రాజేశ్వరి, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ
కుమురంభీం ఆసిఫాబాద్
శుక్రవారం నవంబర్, 17 2023

సంస్కృతి సాంప్రదాయాలను అభివృద్ధి చేసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రతి జాతి తమ సంస్కృతి సాంప్రదాయాలను అభివృద్ధి చేసుకోవాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. మండలంలోని చిర్రకుంట గ్రామంలో కల తన నివాసానికి వచ్చిన గుస్సాడీ బృందానికి స్వాగతం పలకడంతో పాటు ఆదివాసి సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా ప్రత్యేక పూజలు నిర్వహించి గుస్సాడిలతో కలిసి నృత్యం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. భవిష్యత్తు తరాలకు ఇవే ఆస్తిగా ఉంటాయని తెలిపారు.

బహుజనుల గొంతుకను అసెంబ్లీకి పంపాలి

నవతెలంగాణ-దహెగాం

బహుజనుల గొంతుక ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను సిర్పూర్ నియోజకవర్గం నుండి అసెంబ్లీకి పంపించాలని బహుజన ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్, సీనియర్ అడ్వకేట్ రజీహైదర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో బడుగు బలహీన వర్గాలు ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనార్టీలు 90 శాతం ఉన్నప్పటికీ అగ్రవర్ణాలదే ఆదిపత్యం కొనసాగుతుందన్నారు. 40 సంవత్సరాలుగా పాల్వాయి, కోనేరు కుటుంబాలు నియోజకవర్గంలో పాలన చేస్తున్న బలహీన వర్గాల ప్రజలకు ఒరిగిందేమీలేదన్నారు. రెండు కుటుంబికులకు చెందిన పాల్వాయి పురుషోత్తంరావు, పాల్వాయి రాజ్యలక్ష్మి, కోనేరు కోనప్ప ఎమ్మెల్యేలుగా కొనసాగినప్పటికీ నియోజకవర్గంలో సమస్యలు నేటి వరకు పరిష్కారం కాలేదని ఆరోపించారు. ఏండ్ల తరబడి జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు పూర్తికాలేకపోవడమే ఒక ఉదాహరణ అన్నారు. ప్రాణహితను కాళేశ్వరంకు తరలించుకుపోయిన ఈ ప్రాంత ఎమ్మెల్యేలు కనీసం అడ్డుకునే ప్రయత్నం చేయకపోవడం విచారకరమన్నారు. జనాభాలో 50 శాతం ఉన్న బీసీలకు అన్ని రంగాల్లో 50 శాతం వాటా దక్కాలంటే బహుజన సమాజ్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలన్నారు. కాన్షీరామ్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు ఏకమై బీఎస్పీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బహుజన ఐక్యవేదిక రాష్ట్ర కోకన్వీనర్‌లు, న్యాయవాదులు కిశోర్, వినయ్ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-రెబ్బెన

తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై గోలేటి గ్రామ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ విశ్వప్రసాద్ మాట్లాడుతూ బ్యాంకులో ఉన్న స్కీంలు, పథకాలు, రుణాలు, ముఖ్యంగా సామాజిక భద్రత పథకాలైన జీవనజ్యోతి బీమాయోజన పథకం, సురక్షా బీమా పథకం, అటల్ పెన్షన్ యోజన పథకం, ఇన్సూరెన్స్ పథకాల గురించి, మ్యాజిక్ షో, పాటల ద్వారా ప్రజలకు తెలియజేశారు. బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సలుగు స్రావన్, క్యాషియర్ సురేష్, బ్రాంచ్ స్టాఫ్ ఇమ్రాన్, జనార్దన్, ఐకేపీ సిబ్బంది రవి, కృష్ణ, గోలేటి గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బీఆర్ఎస్ ప్రచారం

నవతెలంగాణ-కౌటాల

మండలంలోని కన్నెపెల్లి గ్రామంలో గురువారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆదే వసంత్‌రావు, జెడ్పీటీసీ డోంగ్రే అనుష మధుకర్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ మేనిఫెస్టోలోని అంశాలను వివరిస్తూ, కరపత్రాలను పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో నియోజకవర్గ ప్రజలు ఎంతో మంది లబ్ది పొందుతున్నారని, ఎక్కడా అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్దిదారుని ఖాతాలో నగదును జమచేయడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్పను అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రచారం చేశారు. కోనేరు కోనప్ప ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని, ప్రజలకు అందుబాటులో ఉంటున్నారన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు నిత్యాన్నదానం నిర్వహిస్తూ ఆకలి తీర్చుతున్నారని తెలిపారు. అలాంటి నాయకుడికి అండగా ఉండి గెలిపించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు సెండే నాందేవ్, రాచకొండ అశోక్, సర్పంచ్ మోర్లె రమేష్, జునారే సత్యాన్న, నగోస్ తిరుపతి, మోర్లె మధూకర్, హనుమంతు, మోర్లె సోమయ్య, మండడే ఆనంద్‌రావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మూడోసారి అధికారం ఇవ్వాలి

నవతెలంగాణ-రెబ్బెన

అన్ని వర్గాల ప్రజల అభివృద్ధిని, సంక్షేమ పథకాలను అమలుచేస్తున్న బీఆర్ఎస్‌ను రాష్ట్రంలో ప్రజలు మూడోసారి దీవించాలని ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్ అన్నారు. గురువారం మండలంలోని తుంగెడ గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ పథకాలు, మేనిఫెస్టోలోని అంశాలను క్లుప్తంగా వివరిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. సంక్షేమ పథకాల గురించి ఓటర్లకు వివరించి ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మిని కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీఐటీయూ నుంచి లోకేష్ బహిష్కరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సీఐటీయూకు గతంలో అధ్యక్షునిగా పనిచేసిన అల్లూరి లోకేష్‌ను సంఘం నుండి బహిష్కరిస్తున్నట్లు అధ్యక్షుడు రాజేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఐటీయూ నిబంధనలకు వ్యతిరేకంగా లోకేష్ పనిచేస్తున్నారని తెలిపారు. అందుకే ఆయనను అన్ని రకాల బాధ్యతల నుండి తప్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అనుబంధ సంఘాలతో ఆయనకు ఎటువంటి సంబంధం లేదని సంఘాలను చీల్చే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు త్రివేణి, బాలకిషన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రైతులు పంటను సీసీఐకి విక్రయించాలి

- జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్



పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెటింగ్ అధికారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రైతులు పత్తి పంటకు మద్దతు ధర పొందేందుకు సీసీఐకి విక్రయించాలని జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్ సూచించారు. ఆసిఫాబాద్ పరిధిలోని శ్రీనిధి, శ్రీ వాసవి కాటన్ మిల్‌లో పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీఐ ద్వారా క్వింటాల్ పత్తి కి రూ. 7020 మద్దతు ధర నిర్ణయించిందని తెలిపారు. పత్తి అమ్మడానికి వచ్చే రైతులు బ్యాంక్ అకౌంట్‌తో ఆధార్ లింక్ అయి ఉన్న వాటిని మాత్రమే తీసుకొని రావాలన్నారు. రైతు నేరుగా రాని పక్షంలో రక్త సంబంధీకులను మాత్రమే పంపించాలన్నారు. సీసీఐ ద్వారా పత్తి కొనుగోలుకు సంబంధించి రైతులకు ఉండే అనుమానాలను తొలగించుకోవడానికి ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లాలో మొత్తం 16 సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీఐ కాటన్ పర్చేజింగ్ అధికారి వెంగల్ రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇర్ఫాన్ అహ్మద్ ఖాన్, జిన్నింగ్ మిల్ ఓనర్లు అరుణ్ కుమార్, చిలువేరు గంగన్న, చిలువేరు ప్రవీణ్, తోడూరు కృష్ణ పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి

- అడిషనల్ డీఎంహెచ్ఓ సుధాకర్



పీహెచ్‌సీలో వివరాలు తెలుసుకుంటున్న అడిషనల్ డీఎంహెచ్ఓ

నవతెలంగాణ-జైనూర్

ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యమందిస్తూ రోగుల వివరాలను ఎప్పటికప్పుడు జిల్లాస్థాయి అధికారులకు తెలియజేయాలని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ సుధాకర్ నాయక్ అన్నారు. గురువారం మండలంలోని ఉషేగావ్ ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే ప్రతి ఒక్కరికి వైద్యమందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని ఆదేశించారు. ప్రతి రోగి వివరాలను ఓపీ రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. అనంతరం ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బంది, ఫీల్డ్ స్టాఫ్ సిబ్బంది వివరాలను ఉన్నతాధికారులకు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో గ్రామాల్లో పర్యటిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. దీర్ఘకాలిక వ్యాధులున్న వారి వివరాలను తెలుసుకుంటు వైద్యం అందించేల చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రమేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిరు ధాన్యాల సాగుపై దృష్టి సారించాలి

- కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. శివక్రిష్ణ



మాట్లాడుతున్న కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. శివక్రిష్ణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

రైతులు చిరు ధాన్యాల సాగుపై దృష్టి సారించాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. కోట శివక్రిష్ణ సూచించారు. గురువారం వ్యవసాయశాఖ కార్యాలయంలో జన్ జాతీయ గౌరవ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డా.శివక్రిష్ణ మాట్లాడుతూ అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరాన్ని పురస్కరించుకుని రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించామని తెలిపారు. ప్రతి రైతు పంట మార్పిడి చేసుకోవాలని సూచించారు. రైతులు చిరుధాన్యాలు రాగులు, సజ్జలు, కొర్రలు, సామలు, జొన్నలు సాగుచేయాలని తెలిపారు. 2023 సంవత్సరాన్ని ప్రపంచ చిరు ధాన్యాల సంవత్సరంగా ప్రకటించడానికి గల కారణాలను వివరించారు. ఏడీఏ మనోహర్ మాట్లాడుతూ అరికలు, ఉదలు చిరుధాన్యాల్లో అధిక పోషక విలువలు కలిగి ఉంటాయన్నారు. చిరుధాన్యాలలో బి-విటమిన్లు, అమైనా ఆసిడ్స్, మాంసకృత్తులు అధికంగా ఉంటాయని, ప్రత్యేకంగా ఇందులో ఖనిజలవణాలు, ఐరన్ మెగ్నీషియం, పొటాషియం అధికంగా ఉంటాయని తెలిపారు. ఏఓ రామక్రిష్ణ మాట్లాడుతూ చిరుధాన్యాల వంటకాలు నిండైన ఆరోగ్యానికి మెండైన రుచులు అని చెప్పారు. చిరుధాన్యాలను ప్రతిరోజు తీసుకోవడంతో మధుమోహ వ్యాధులను తగ్గించుకోవచ్చున్నారు. చిరుధాన్యాలను పండించడం వల్ల ఖర్చును తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ తిరుపతి, డాక్టర్ సతీష్, ఏఓ రామక్రిష్ణ, ఏఈఓలు, గిరిజన రైతులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజలు రానున్న ఎన్నికల్లో ఓటు వేయడానికి భయభ్రాంతులకు గురికావాల్సిన అవసరం లేదని, ఒత్తిళ్లకు గురికాకుండా ఓటు వేయాలని జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ తెలిపారు. మావోయిస్టులు గత కొన్ని రోజులుగా ఎన్నికలపై పత్రిక ప్రకటనలు విడుదల చేస్తున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల ప్రజలు కూడా భయపడకూడదని నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ప్రజలకు పోలీసులు అండగా ఉంటారని తెలిపారు. అభ్యర్థులు, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసే మావోయిస్టు ప్రకటనలపై ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తున్నామన్నారు.

7

నవతెలంగాణ

మంచిర్యాల

శుక్రవారం నవంబర్, 17, 2023

ఓటు హక్కును వినియోగించుకోవాలి

రామకృష్ణాపూర్ : ఓటు హక్కును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏసీపీ పంతాటి సదయ్య అన్నారు. గురువారం పట్టణంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ మార్చ్ రామాలయం నుండి సూపర్ బజార్ చౌరస్తా మీదుగా రాజీవ్ చౌక్ వరకు సాగింది. పోలీస్ సిబ్బందితో పాటు సీఆర్పీఎఫ్ బెటాలియన్, ఉమెన్ బెటాలియన్ బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలనే ఉద్దేశ్యంతో ఫ్లాగ్‌మార్చ్ చేపట్టామని ఏసీపీ సదయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సీఐ మహేందర్ రెడ్డి, ఎస్సై జి.రాజశేఖర్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుకు దంపతుల పాదయాత్ర

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మంచిర్యాల కాంగ్రెస్ అభ్యర్థి ప్రేమ్‌సాగర్ రావు గెలుపుకు దంపతులు పాదయాత్ర నిర్వహించారు. హాజీపూర్ మండలం నర్సింగపూర్ గ్రామానికి చెందిన గుండ స్వరూప-అంజయ్య దంపతులు పాదయాత్రచేపట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. చంద్రశేఖర్ రెడ్డి గ్రామంలోని బుగ్గట్టు హనుమాన్ గుడి నుండి రెండో అన్నవరంగా పిలిచే గూడెం సత్యనారాయణ స్వామి ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించనున్నారు. అక్కడ స్వామిని దర్శించుకొని ప్రేమ్‌సాగర్ గెలుపుకు పూజలు చేయనున్నారు. గురువారం పాదయాత్ర లక్షెట్టిపేటకు చేరుకోవడంతో పార్టీ నాయకులు రాందేని వెంకటేష్ నాయకులతో కలిసి స్వాగతం పలికారు. వారిని అభినందిస్తు అభ్యర్థిపై ఉన్న అభిమానంపై హర్షం వ్యక్తం చేశారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-జన్నారం

వరి కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని ఐకేపీ ఏపీఎం బుచ్చయ్య సూచించారు. గురువారం మండలంలోని మొర్రిగూడ గ్రామంలో డీఆర్డీఏ, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. వరి మొదటి రకానికి రూ. 2203, రెండవ రకానికి రూ.2183 గిట్టుబాటు ధరతో కొనుగోళు చేస్తున్నాట్టు తెలిపారు. రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా పండించిన వరి ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాలకే తరలించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీసీ మహేందర్, వీఓఏలు రమేష్, సుధాకర్, శీను, ప్రకాష్, వినయ్, రాము, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల ముమ్మర ప్రచారం

నవతెలంగాణ-జన్నారం

కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్ తరపున ఆ పార్టీ శ్రేణులు ముమ్మర ప్రచారం నిర్వహించారు. గురువారం పట్టణంలోని రాంనగర్ కాలనీలో ఇంటింటికి తిరుగుతూ ఆరు గ్యారెంటీలని ప్రజలకి వివరిస్తూ ప్రచారం కొనసాగించారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. పదేండ్లుగా కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్‌లు ప్రజలకు చేసిందేమి లేదన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటిలను అమలు చేస్తామని హామీ ఇచ్చుఆరు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు దుమల్ల రమేష్, మాజీ మండల ప్రధాన కార్యదర్శి ఫసీ ఉల్లా, హేమంత్ చారి, బీనవేని గంగన్న, రాజన్న, ఇందయ్య, నర్సింగ్ రావ్, దుమల్ల ప్రవీణ్, ప్రశాంత్, పవన్, కిరణ్, శ్రీనివాస్, సత్తన్న పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-భీమారం

మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. గురువారం మండల కేంద్రంలోని వేపచెట్టు వాడలో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రచార సభలో కాంగ్రెస్ నాయకులు గుడిమల్ల వెకటేష్(వెంకటి మేస్త్రీ)తో పాటు పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ప్రచార సభలో పాల్గొన్న చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ పార్టీలో చేరుతున్న వారికి గులాభి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.పార్టీ బలోపేతం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చెరుకు సర్వోత్తం రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్, సర్పంచ్ గద్దె రాంరెడ్డి, డా. రాజా రమేష్ పాల్గొన్నారు.

సొంత ఖర్చుతో ప్రహరీగోడ నిర్మాణం

నవతెలంగాణ-జైపూర్

షెట్‌పల్లి గ్రామంలోని రామాయలం ప్రహరి నిర్మాణానికి సర్పంచ్ మేడి రవి సొంత డబ్బులను ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. రూ. 6.5లక్షలతో ఆలయం ప్రహరి నిర్మించడంతో పాటు ఆలయ ముఖ ద్వారంలో గేట్ ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. గ్రామస్తులతో పాటు భక్తుల అభ్యర్థన మేరకు ప్రహరిగోడ, గేటు ఏర్పాటు చేయడంతో పాటు మౌళిక వసతుల కల్పనకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

తాండూర్ బీఆర్ఎస్‌లో ఆధిపత్య పోరు

- కాంగ్రెస్‌లోకి చేరుతున్న నాయకులు

నవతెలంగాణ-తాండూర్

తాండూరు మండలంలో బీఆర్ఎస్ నాయకత్వంలో ఆధిపత్యపోరు కొనసాగుతుంది. తాజాగా మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ తన వర్గంతో కాంగ్రెస్‌లో చేరగా బీఆర్ఎస్ మండల అధ్యక్షులు దత్తమూర్తి వర్గానికి చెందిన రేచీని సర్పంచ్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. తాండూరు మండలంలో 15 జీపీల్లో బీఆర్ఎస్ సర్పంచ్‌లే ఉన్నారు. ఎంపీపీతో పాటు ఆరు ఎంపీటీసీ స్థానాలు కూడా బీఆర్ఎస్‌వే ఉన్నాయి. మండలంలో 55 శాతం మున్నూరు కాపు నాయకులు ఆశించిన జెడ్పీటీసీ స్థానాన్ని వేరే సామాజిక వర్గానికి చెందిన కేటాయించారు. అప్పటి నుంచి పార్టీలో వర్గపోరు మొదలైంది. జనాభా, నాయకత్వ పరంగా సంఖ్య బలం ఉన్న కాపు నాయకులు జెడ్పీటీసీ ఆధిపత్యాన్ని మొదటి నుండి వ్యతిరేకిస్తున్నారు. జెడ్పీటీసీ కాపు కులస్తుల భూ వివాదాలు, కుల పంచాయతీల్లో తలదూర్చి ఆధిపత్యం చేయడాన్ని కాపు సామాజిక వర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులకు గిట్టడం లేదు. స్థానిక ఎమ్మెల్యే సైతం జెడ్పీటీసీకి స్థాయి కంటే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడంతో వారు పార్టీని విడుతున్నారు. బీఆర్ఎస్‌ను వదిలి కాంగ్రెస్‌లోకి చేరుతున్నారు. మాజీ ఎంపీటీసీ సిరంగి శంకర్, సింగిల్ విండో డైరెక్టర్ తిరుపతి, రాజన్నలతో పాటు బీసీ సామాజిక వర్గానికి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్ అంతర్గత విభేదాలను నాయకత్వం గుర్తించి జాగ్రత్త వహించకపోతే మండలంలో బీఆర్ఎస్ ఖాళీ అయ్యే ప్రమాదం ఉంది. మండలంలో బీఆర్ఎస్‌లో జరుగుతున్న పరినామాలను కాంగ్రెస్ తనకు అనుకూలంగా మలుచుకుంటూ భారీ షాక్ ఇచ్చేల సమయత్తం అవుతుంది.



కాంగ్రెస్‌లో చేరిన మండల బీఆర్ఎస్ నాయకులు

కేటీఆర్ సభ విజయవంతం చేయండి



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించే ఆశీర్వాద సభకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి తారక రామారావు హాజరవుతారని, సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ కోరారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించే సభాస్థలిని పరిశీలించి ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఈ సభకు నియోజకవర్గం నుంచి 40 వేల మందిని తరలివచ్చే విధంగా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. సభకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. జన సమీకరణపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరాగా వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీఎస్సీ మాజీ మెంబర్ రవీందర్‌రావ్, ఎంపీ జెడ్పీటీసీ జానుబాయ్, ఎంపీపీ మాదాడి సరోజన, జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, పార్టీ అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి జనార్ధన్, సర్పంచి జక్కు భూమేష్, కోఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రియాజుద్దీన్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు గంగాధర్ పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలి

నవతెలంగాణ-తాండూర్

ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పోటీలో ఉన్న అభ్యర్థులు సహకరించాలని ఎన్నికల పర్యవేక్షకులు విశ్వజిత్ దత్త అన్నారు. గురువారం బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీలో ఉన్న అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నియామవళిని అనుసరించి పోటీలో ఉన్న అభ్యర్థులందరికీ ఒకే రకమైన షరతులు వర్తిస్తాయని తెలిపారు. అభ్యర్థులంతా ఎన్నికల నియామలకు లోబడి పార్టీల ప్రచారం చేసుకోవాలన్నారు. సభలు, సమావేశాలు, అనుమతుల విషయంలో అన్ని పార్టీలకు సమాన అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఊరేగింపు, ర్యాలీల విషయంలో ముందస్తు సమాచారం అందించాలని సూచించారు. అభ్యర్థులు నిర్దేశించిన తేదీ నుండి పోలింగ్ వరకు ఎన్నికల ఆంక్షాలను పాటిస్తూ ఎన్నికల నిర్వహణకు తోడ్పడాలని కోరారు. ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురి చేసిన చర్యలుంటాయని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలను పార్టీల అభ్యర్థులు పాటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అబ్జర్వర్ ఆర్. ఇళంగో, రిటర్నింగ్ అధికారి రాహుల్, బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు దుర్గం చిన్నయ్య, గడ్డం వినోద్, వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు పాల్గొన్నారు



సమావేశంలో పాల్గొన్న ఆయా పార్టీల ఎమ్మెల్యేల అభ్యర్థులు



కుట్టు మిషన్ అందజేత

నవతెలంగాణ-లక్షెట్టిపేట

సేవ సమితిల ఆధ్వర్యంలో యువతికి కుట్టు మిషన్ అందించారు. గురువారం మండలంలోని వెంకట్‌రావ్‌పేట గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన శ్యామల సునీతకు సాయిబాబా గోదావరి భక్తమండలి, శ్రీ శివ సాయి గణేష్ సేవ సమితి వారి ఆధ్వర్యంలో కుట్టు మిషన్‌ను అందించారు. స్వయం ఉపాధి పొంది కుటుంబ పోషణ చేసుకోవాలనే ఉద్దేశ్యంతో కుట్టు మిషన్‌ను అందించామని సమితి అధ్యక్షులు పాటిబండ్ల రామమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు ప్రశాంత్, విక్రమ్, రాకేష్, యోగి, రిత్విక్, శివ, సాయి, ప్రసన్న, సుమతమ్మ, సత్యనారాయణ, వినోద్, శర్మ, ప్రభాకర్ పాల్గొన్నారు.

c m y k

వెల్లువెత్తిన జన సందోహం..!



మాట్లాడుతున్న కేసీఆర్, పక్కన అభ్యర్థి అనిల్‌జాదవ్

- విజయవంతమైన బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభ
- గులాబీమయంగా మారిన ఇచ్చోడ పరిసరాలు
- పల్లెలు, గూడేలు, తండాల నుంచి కదలివచ్చిన జనం

నవతెలంగాణ- ఇచ్చోడ

బోథ్ బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ విజయవంతమైంది. ఈ సభకు నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి జనం వెల్లువలా పోటెత్తారు. ప్రజలు, గులాబీ శ్రేణులు భారీగా కదలిరావడంతో ఇచ్చోడ మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాలు జన సంద్రాన్ని తలపించాయి. పల్లెలు, గూడెలు, తండాల నుంచి భారీ ఎత్తున జనం తరలివచ్చారు. గురువారం బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభను ఇచ్చోడ మండల కేంద్రలోని బైపాస్ రోడ్డు వద్ద నిర్వహించారు. ఈ సభకు ముఖ్యమంత్రి కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకాగా.. జిల్లాలోని ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్‌జాదవ్‌ను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇక్కడ బీఆర్ఎస్ అభ్యర్థి గెలిస్తేనే అక్కడ హైదరాబాదులో ప్రభుత్వం ఏర్పడుతుందని చెప్పి ప్రజలను ఆలోచింపజేశారు. సీఎం ప్రసంగాన్ని పార్టీ శ్రేణులతో పాటు ప్రజలు సైతం ఉత్సాహంగా వీక్షించారు.

కేసీఆర్‌కు ఘన స్వాగతం..!

ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొనేందుకు మధ్యాహ్నం 3గంటల సమయంలో వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నాయకులు ఘన స్వాగతం పలికారు. బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్‌జాదవ్, మాజీ ఎంపీ గోడం నగేష్‌లు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం సభలో సీఎం ప్రసంగించారు. అంతకుముందు నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్‌జాదవ్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగంలో వాటిని ప్రస్తావిస్తూ అధికారంలోకి రాగానే ఆయా అభివృద్ధి పనులను త్వరితగతిన చేపడుతామని భరోసా ఇవ్వడంతో గులాబీ శ్రేణులు ఒక్కసారిగా హర్షధ్వానాలు వ్యక్తం చేశారు. చప్పట్లు కొడుతూ ఉత్సాహాన్ని కనబర్చారు. ముస్లిం మైనార్టీలను కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా వాడుకొని మత కలహాలను సృష్టించిందని విమర్శించారు. బీజేపీ మత పిచ్చితో మంటలు రేపుతోందని ఆరోపించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మేనిఫెస్టోలో పొందుపర్చిన వాటిన్నింటిని అమలు చేస్తామని హామీనిచ్చారు. ఓటు ప్రాముఖ్యతను వివరిస్తూ..ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. వజ్రాయుధంలాంటి ఓటును జాగ్రత్తగా వినియోగించాలని తెలిపారు. ఎవరో చెప్పారని ఓటేస్తే మనల్ని కాటేస్తుందని..జాగ్రత్తగా మసులుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో అదిలాబాద్ నియోజకవర్గ అభ్యర్థి జోగు రామన్న, జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్,సర్పంచులు,ఎంపిటిసిలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



హాజరైన ప్రజలు

ప్రేమ్‌సాగర్‌రావు ఎమ్మెల్యే కావాలని గూడెం గుట్టకు పాదయాత్ర

నవతెలంగాణ - హాజీపూర్

నాయకుల మీద అభిమానంతో పెద్ద పెద్ద కటౌట్లు ఏర్పాటు చేసే అభిమానులు, కార్యకర్తలు ఉంటారు. కానీ ఓ అభిమాని తమ నాయకుడి కోసం గూడెం గుట్ట వరకు పాదయాత్ర చేస్తున్నాడు. తమ నాయకుడు త్వరలో జరుగబోయే ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలువాలని కాంక్షిస్తూ మండలంలోని బుగ్గగట్టు హనుమాన్ ఆలయం నుండి దండేపల్లి మండలం గూడెం సత్యనారాయణ స్వామి దేవస్థానం వరకు పాదయాత్ర చేపట్టాడు. మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన గూడ అంజయ్య కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుకు వీరాభిమాని. పీఎస్సార్ కోసం ఏం చేయడానికైనా సిద్ధం అంటూ గతంలో అనేకసార్లు ప్రకటించాడు. తాజాగా గూడా అంజయ్య తన సతీమణి శ్యామలతో కలిసి గూడెం గుట్ట వరకు పాదయాత్రగా బయలుదేరి అభిమానాన్ని చాటుకున్నాడు. దీనికి మేము సైతం అంటూ కొండవీటి చంద్రశేఖర్‌రెడ్డి, మెండు తిరుపతి పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రను ఓబిసి మండల అధ్యక్షులు సాంబారి కుటుంభరావు జెండా ఊపి ప్రారంభించారు. పాదయాత్రకు మద్దతుగా నర్సింగాపూర్ గ్రామానికి చెందిన బైకం కనకరాజు, నల్ల లక్ష్మణ్, లగిశెట్టి మనోజ్, సింగిరెడ్డి గంగారెడ్డి, జువ్వాడి



పాదయాత్రగా వెళ్లున్న అంజయ్య దంపతులు, కాంగ్రెస్ నాయకులు

సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గూడా అంజయ్య దంపతులు మాట్లాడుతూ ప్రజాసేవ కోసం నిరంతరం పాటుపడే నాయకుడు ప్రేమ్‌సాగర్‌రావు ఎమ్మెల్యేగా గెలిస్తే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని, త్వరలో జరగబోయే ఎన్నికల్లో తమ అభిమాన నాయకుడు గెలవాలని ఈ పాదయాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు. నిత్యం జనాల గురించి ఆలోచిస్తూ, నిరుపేద ప్రజల కోసం ఎన్నో సేవ కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ప్రేమ్‌సాగర్‌రావు ముందుంటాడన్నారు. విషయం తెలుసుకున్న రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ పుస్కూరి శ్రీనివాస్‌రావు పాదయాత్ర చేస్తున్న అంజయ్య దంపతులను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా సుమారు 30 మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాదయాత్రతో గూడెం గుట్టకు బయల్దేరారు.

సిర్పూర్ గడ్డపై నీలి జెండా ఎగరాలి

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్‌పీ



ప్రచారంలో పాల్గొన్న ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్

నవతెలంగాణ-దహేగాం

రాబోయే ఎన్నికల్లో బీఎస్పీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసి సిర్పూర్ గడ్డపై నీలి జెండా ఎగరవేయాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని ఇట్యాల, గొర్రెగుట్ట, కేస్లాపూర్, రాల్లగుడెం, బీబ్రా, భీమిని మండలం చిన్న గుడిపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కోనప్ప పోలీసులను అడ్డుపెట్టుకొని ఓట్ల కోసం పల్లెల్లో తిరుగుతున్నారని విమర్శించారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఓడించి కేసీఆర్‌ను గద్దె దించాలన్నారు. ప్రచారంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, జిల్లా నాయకులు పిల్లల తిరుపతి, అధ్యక్షులు ఎల్కారి ప్రశాంత్, దుర్గం దేవదాస్, షాకీర్, కవిత లక్ష్మీ, స్వరూప పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు రాథోడ్ శేషారావు రాజీనామా

- కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు ప్రకటన

నవతెలంగాణ-కెరమెరి



కాంగ్రెస్ సీనియర్ నాయకులు, అనార్‌పల్లి సర్పంచ్ రాథోడ్ శేషారావు పార్టీకి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో సమావేశంలో మాట్లాడుతూ పని చేసే వారికి కాంగ్రెస్‌లో గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ ఎమ్మెల్యే టికెట్ పొంది 20 రోజులు గడుస్తున్నా, సీనియర్ నాయకులను కలుపుకు పోకపోవడంతో, ఆయన తీరుతో మనస్తాపం చెంది పార్టీకి రాజీనామా చేస్తున్నానని చెప్పారు. పార్టీ కోసం ఎంతో కష్టపడ్డానని, పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేసినప్పటికీ అధిష్టానం మోసం చేసిందని ఆరోపించారు. కష్టపడ్డ వారిని కాదని, నిన్న గాక మొన్న చేరిన స్థానికేతరులకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడంతో అధిష్టానం నిర్ణయాన్ని తప్పు బట్టారు. కాంగ్రెస్‌లో కష్టపడిన వారికి న్యాయం లేదని ఆరోపించారు. కార్యకర్తలు, అభిమానుల అభిప్రాయం మేరకు రాజీనామా చేశానని తెలిపారు. జన్నారంలో జరిగే ఆశీర్వాద సభలో మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు పేర్కొన్నారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-భీమారం

మండలంలోని అంకుశాపూర్ గ్రామానికి చెందిన కొండగొర్ల మధుకర్(29) ఆత్మహత్యకు చేసుకున్నట్టు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. గత కొంత కాలంగా మధుకర్ తీవ్ర కడుపునొప్పితో బాధపడుతూ మంగళవారం రాత్రి పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. భార్య కవిత, నలుగురు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

బీజేపీ ప్రచార రథాన్ని ధ్వంసం చేసిన గుండి గ్రామస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ గ్రామానికి వచ్చే రహదారిలో ఉన్న వాగుపై బ్రిడ్జి నిర్మించడంలో విఫలమైన రాజకీయ పార్టీలు అన్నింటిని బహిష్కరిస్తున్నట్లు గుండి గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మాణం చేశారు. రాజకీయ పార్టీలు తమ గ్రామానికి రాకుడదని సూచించారు. దీంతో రాజకీయ నాయకులు ఆ గ్రామానికి వెళ్లాడం లేదు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం బీజేపీ అభ్యర్థి అజ్మీర ఆత్మరాం నాయక్ ప్రచార రథం గ్రామానికి వెళ్లగా గ్రామస్తులు ప్రచార రథాన్ని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు ఓటమి భయంతోనే దాడి చేయించారని ఆత్మరాం





నాయక్ ఆరోపించారు. ఇదే విషయమై గ్రామస్తులు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వచ్చిన నుంచి తమ గ్రామానికి ఎవరు రావద్దని ఓట్లను బహిష్కరిస్తున్నట్టు ఫ్లెక్సీలు కూడా పెట్టామని తెలిపారు. దాన్ని అతిక్రమించి గ్రామంలోకి రావడంతో ధ్వంసం చేసినట్టు గ్రామస్తులు తెలిపారు. అన్ని పార్టీలకు ఇది వర్తిసుందని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ అధికారంలోకొస్తే గ్రామాల అభివృద్ధి

నవతెలంగాణ-తాండూర్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని బెల్లంపల్లి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం వినోద్ వెంకటస్వామి అన్నారు. గురువారం మండలంలోని మాదారం-3 ఇన్‌క్లైన్, నర్సాపూర్, బెజ్జాల, అబ్బాపూర్ గ్రామాల్లో ప్రచారంలో చేపట్టారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గ్రామాల అభివృద్ధికి ఎంతగానో తోడ్పడిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే గ్రామస్థాయి నుండి అభివృద్ధి జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ సామాన్య ప్రజలకు, మహిళలకు, రైతులకు న్యాయం జరిగేలా పథకాలను రూపొందించిందని తెలిపారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎంపీటీసీ సూరం రవీందర్, మండల అధ్యక్షుడు ఎండి ఈసా, ఎంపీటీసీ సిరంగి శంకర్, నాయకులు సూరం దామోదర్‌రెడ్డి, సుభాష్, పేరం శ్రీనివాస్ పాల్గొన్నారు.

జోనల్ స్థాయికి విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో అండర్ 14, 17 జిల్లా స్థాయి బాలుర, బాలికల షటిల్ బ్యాట్మెంటన్, టెన్నికాయిట్ జోనల్ స్థాయి ఎంపిక పోటీలు జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సాంబశివరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ పాఠశాలల నుండి 60 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో సబ్ జూనియర్‌లను ఐదుగురిని, జూనియర్లను ఐదుగురిని ఎంపిక చేసినట్లు తెలిపారు. పోటీల్లో ఎంపికైన వారు శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరగనున్న జోనల్ స్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు మానసిక, శారీరక ఆరోగ్యాన్ని ఇస్తాయన్నారు. విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సిహెచ్ మధుసూదన్, ఫిజికల్ డైరెక్టర్ కె.ప్రవీణ్, పీఈటీ తిరుపతి, యాదగిరి, సునీత, రజిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు

బీఆర్ఎస్‌కు ఓటేసి గెలిపించాలి



నవతెలంగాణ-ముధోల్

బీఆర్ఎస్‌కు ఓటేసి గెలిపించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షులు అఫ్రోజ్ ఖాన్ అన్నారు. గురువారం నియోజకవర్గ కేంద్రమైన ముధోల్‌లో వార్డు నెంబర్ ఒకటి నుంచి నాలుగు వార్డుల్లో బీఆర్ఎస్ ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్, పార్టీలపై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖాలిద్, మాజీ ఎంపీపీ ఏజాజోద్దీన్, మాజీ పీఏసీఎస్ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, ఎంపీటీసీ సరళ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు పోతన్న యాదవ్, సమీల్లాఖాన్, విశ్వంబర్, మనోరంజన్, ఇమ్రాన్ ఖాన్ పాల్గొన్నారు.

బీఎస్పీలో ఉప సర్పంచ్ ఆనంద్ చేరిక



కండువా వేసి బీఎస్పీలోకి ఆహ్వానిస్తున్న ఆర్ఎస్పీ

నవతెలంగాణ - సిర్పూర్(టి)

మండలంలోని హుడ్కిళి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ తాన్సె ఆనంద్ గురువారం బీఎస్పీలో చేరారు. ఆయనకు అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అధికార పార్టీ అరాచకాలు అరికట్టి బహుజన సమాజాన్ని సాధించే దిశగా యువతీ యువకులు ముందుకురావాలని అన్నారు. కొన్నేండ్ల నుండి నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనుకబాటుతనాన్ని గుర్తించి యువత, వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు ఆలోచించి పార్టీలోకి రావడం హర్షణీయమని తెలిపారు. వివిధ గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించామని, ఎన్నికల్లో గెలిచిన అనంతరం వాటిని పరిష్కరిస్తామన్నారు. ఆనంద్ మాట్లాడుతూ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీన్‌కుమార్ తన ఉన్నతమైన ఉద్యోగానికి రాజీనామా చేసి పేద ప్రజల సంక్షేమం కోసం రాజకీయాల్లోకి వచ్చారని, నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరగాలంటే బీఎస్పీ అధికారంలోకి తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, నాయకులు నగరాడె రాజు, ఇప్ప స్వామి, రవి, సుభాష్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం

నవతెలంగాణ-నార్నూర్

చలికాలం సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఆశ్రమ పాఠశాలలో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని పీహెచ్‌సీ వైద్యుడు రాంబాబు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో వైద్య సిబ్బందితో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జ్వరం, జలుబు, దగ్గు ఉన్న 10 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు. చలికాలం జాగ్రత్తలపై పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ వైద్యశిబిరంలో హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, వైద్య సిబ్బంది ఈశ్వర్, ప్రధానోపాధ్యాయుడు ధర్మేందర్, ఉపాధ్యాయ సిబ్బంది దిగాంబర్, నాందేవ్ ఉన్నారు.



సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే బరిలో..

నవతెలంగాణ-ఉట్నూర్

నియోజకవర్గ సమస్యల సాధనకై ఎమ్మెల్యే బరిలో స్వతంత్ర అభ్యర్థిగా ఉన్నానని ఆత్రం రవీందర్ అన్నారు. గురువారం స్థానిక ప్రెస్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే రేసులో ఉన్న స్వతంత్ర అభ్యర్థి ఆత్రం రవీందర్ మాట్లాడుతూ గతంలో ఎందరో మంది ఎమ్మెల్యేలుగా పని చేసిన నియోజకవర్గాన్ని ఎవరు పట్టించుకోలేదన్నారు. అనేక సమస్యలు రాజ్యమేలుతున్న ఏ ప్రభుత్వం కన్నెత్తి చూడటం లేదన్నారు. కంటి తుడుపులుగా అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలంగాణ ప్రభుత్వం గొప్పలు చెబుతున్న ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. జల్.. జంగల్.. జమీన్.. కోసం పోరాటం చేసిన మహనీయుడు కుమురంభీం ఆశయాలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎన్నో ఉద్యమాలు ప్రజా ఆందోళనలతో తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నప్పటికీ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు రాలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమం కోసం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కడం ప్రాజెక్టు మరమ్మతులకు నిధులు కేటాయించడంలో ప్రభుత్వ విపలమైందని ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల్లోని సర్పంచులు, ఎంపీటీసీలకు, నిధులు రాక అప్పుల పాలు అవుతున్నారని మరికొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని గుర్తు చేశారు. గత వర్షకాలంలో కురిసిన వర్షాలకు వరదలతో రైతుల పంటలు నష్టపోయిన ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. 317 జీఓ ఎత్తివేసి ఉపాధ్యాయులు, ఉద్యోగుల ఇబ్బందులను తొలగించాలన్నారు. రానున్న ఎన్నికల్లో తనను ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సాయికృష్ణ, అహ్మద్ ఉన్నారు.



మాట్లాడుతున్న స్వతంత్ర అభ్యర్థి ఆత్రం రవీందర్

ఎన్నికల ప్రచారం ప్రారంభించిన సంజీవ్‌రెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా సంజీవరెడ్డి తన ఎన్నికల ప్రచారాన్ని గురువారం ప్రారంభించారు. కాగా ఎన్నిక అధికారి వారికి ఉంగరం గుర్తును కేటాయించారు. కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షులు సాజిద్‌ఖాన్, మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాతతో కలిసి ఓల్డ్ హౌసింగ్ బోర్డు కాలనీలోని గణపతి, రామాలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి, అక్కడి నుండి తమ ప్రచారాన్ని ప్రారంభించారు. పట్టణంలోని బొక్కల్‌గూడ, ఖానాపూర్, అంబేద్కర్‌నగర్ కాలనీల్లో ప్రచారం చేపట్టి తనకు కేటాయించిన ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంది సతీమణి విస్తృతంగా ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న కంది సాయి మౌనారెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా తన భర్త కంది శ్రీనివాసరెడ్డి ప్రత్యక్ష రాజకీయాల్లో అడుగుపెట్టారని, ఆయన సతీమణి కంది సాయి మౌనారెడ్డి అన్నారు. పట్టణంలోని రాణిసతీజీ, విద్యానగర్ కాలనీలలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి తన భర్త, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డికి మద్దతుగా గురువారం ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ తిరుగుతూ చేయి గుర్తుకే ఓటు వేయాలని, హస్తం పార్టీని గెలిపించాలని క్యాంపెయిన్ నిర్వహించారు. పార్టీ ఆరు గ్యారంటీ హామీలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేసి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల సమయం దగ్గరపడిందని, అందరూ అప్రమత్తంగా ఉండి ఈసారి కాంగ్రెస్ పార్టీని గెలిపించే బాధ్యతను తీసుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్‌లో మార్పు రావాలంటే తన భర్తకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటిలను ఇంటింటికి వెళ్లి కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని ఆమె కోరారు. ప్రజలు కూడా ఈ సారి సహకారం అందించాలన్నారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో తమ అమూల్యమైన ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ముడుపు నళినిరెడ్డి, లత, స్వప్న, ప్రమీల, సుస్మిత, శరణ్య, అఖిల్‌రెడ్డి, ప్రభాకర్, సన్నీ, రామన్న పాల్గొన్నారు.

హోరాహోరీగా ప్రచారం

నవతెలంగాణ - వాంకిడి

మండల కేంద్రంలో గురువారం బీఆర్ఎస్, కాంగ్రెస్, బీఎస్పీ నాయకులు హోరాహోరీగా ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అధ్యక్షుడు, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, మండల అధ్యక్షురాలు ముండె విమలాబాయి, మర్సకోల సరస్వతి, సింగిల్‌విండో చైర్మెన్ పెంటు, కార్యకర్తలు మండలకేంద్రంలో తిరుగుతూ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రచారం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధిని వివరిస్తూ కారు గుర్తుకు ఓటేయ్యాలని కోరారు. అలాగే కాంగ్రెస్ నాయకులు మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు.